సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

90324 97123

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

మూలవిరాట్‌ను తాకిన సూర్య కిరణాలు


సూర్యనారాయణమూర్తి మూలవిరాట్టును తాకిన కిరణాలు

అల్లిపురం: వెంకటేశ్వరమెట్టపై అలివేలు మంగమ్మ ఆలయంలో వెలసిన శ్రీ సూర్యనారాయణమూర్తి దేవాలయంలో సోమవారం ఉదయం మూలవిరాట్టును సూర్యకిరణాలు తాకాయి. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు పాణంగిపల్లి కేశవాచార్యులు స్వామికి విశేష పూజలు నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల లోగా సూర్య కిరణాలు మూలవిరాట్టును తాకాయన్నారు. ప్రతి ఏడాది మూడు రోజుల పాటు ఈ విధంగా సూర్యకిరణాలు తాకుతాయని ఆయన తెలిపారు.

సంపూర్ణ గీతా పారాయణం


ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఎంవీ రాజశేఖర్

డాబాగార్డెన్స్: పాతనగరంలోని రాజప్పనాయుడు వీధిలోని గీతాభవనంలో ఏకాదశిని పురస్కరించుకుని సమితి అధ్యక్షుడు చావలి విశ్వేశ్వరరావు సారధ్యంలో సోమవారం సంపూర్ణ గీతా పారాయణం నిర్వహించారు. గీతా ప్రచార సమితి మహిళా సభ్యులు సామూహికంగా 18 అధ్యాయాలతో కూడిన భగవద్గీతలో గల అన్ని శ్లోకాలు ముక్తకంఠంతో పారాయణ చేశారు. అనంతరం విచ్చేసిన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఇటీవల ఇస్కాన్ నిర్వహించిన గీతాజయంతి ఉత్సవంలో గీతా ప్రచార సమితి సభ్యులు పాల్గొని సామూహికంగా సంపూర్ణ గీతా పారాయణం చేసినందుకు గాను ఇస్కాన్ తరపున సంస్థ పీఆర్వో, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్ ఉత్సవంలో పాల్గొన్న వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో గీతా ప్రచార సమితి ప్రతినిధులు సీహెచ్ విశ్వేశ్వరరావు, ఎం. వనజాదేవి, జీవీఆర్ ప్రసాద్, జి. లక్ష్మీనరసింహ తదితరులు పాల్గొన్నారు.

యువకుడిపై దాడి చేసిన ఇద్దరి అరెస్ట్

అల్లిపురం: యువకుడిపై బీరు బాటిల్‌తో దాడికి పాల్పడిన ఇద్దరిని మహారాణిపేట పోలీసులు సోమవారం అరెస్ట్ చేసి హోమ్‌కు తరలించారు. సీఐ భాస్కరరావు తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 8వ తేదీ రాత్రి సుమారు 7 గంటల సమయంలో జగదాంబ దరి యల్లమ్మ అమ్మవారి పండగ సందర్భంగా కొబ్బరితోట, ఎస్‌వీపీ నగర్‌కు చెందిన చింతల సాయి మనోహర్ అక్కడికి వెళ్లాడు. రాత్రి 10.15 గంటల సమయంలో జగదాంబ థియేటర్ వైపు అతను వెళ్తుండగా హైదరాబాద్ ఇరానీ టీ దుకాణం వద్ద కొంత మంది యువకులు గొడవ పడుతున్నారు. సాయి మనోహర్ అక్కడికి వెళ్లగా ఒక బాలుడు అతని చొక్కా పట్టుకున్నాడు. మరొక బాలుడు పక్కనే ఉన్న బార్ వద్ద నుంచి బీరు బాటిల్ తీసుకొచ్చి సాయి మనోహర్ మెడపై కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఆ సమయంలో దాడి చేసిన ఇద్దరు తమపై అనేక కేసులున్నాయని, నువ్వు మమ్మల్ని ఏం చేయలేవని బెదిరించినట్లు మనోహర్ తెలిపాడు. తీవ్రంగా గాయపడిన మనోహర్ చికిత్స పొందిన తర్వాత మహారాణిపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో దాడికి పాల్పడిన వారిని అరెస్ట్ చేసి హోమ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

పోలీస్ బ్యాండ్ గదుల ప్రారంభం


పోలీస్ బ్యాండ్ గదులను ప్రారంభిస్తున్న సీపీ బాగ్చి

విశాఖ సిటీ: పోలీస్ బ్యాండ్ కోసం పోలీస్ బ్యారెక్స్‌లో నూతనంగా నిర్మించిన గదులను పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి సోమవారం ప్రారంభించారు. పలు కార్యక్రమాలకు బ్యాండు అందించేందుకు 19 మంది సభ్యులతో పోలీస్ బ్యాండ్ ఉంది. సీపీ గతంలో బ్యాండు గది శిథిలావస్థలో ఉన్నట్లు గుర్తించారు. దీంతో అదే ప్రాంగణంలో నూతన గదులను నిర్మించాలని అధికారులను ఆదేశించారు. వెంటనే గదులను నూతనంగా నిర్మించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో నగరంలో పోలీస్ సంబంధిత కార్యక్రమాలకే కాకుండా, ఇతర జాతీయ, అంతర్జాతీయ కార్యక్రమాలకు అనువుగా బ్యాండ్ నిర్వహించేందుకు అవసరమైన సంగీత పరికరాల కొనుగోలుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

శిథిలావస్థకు చేరుకునా.. మరమ్మతులు సున్నా


పెచ్చులు ఊడిపోయిన గోడలు



శిథిలావస్థకు చేరుకున్న పోర్టికో

- భయపెడుతున్న టీఎస్‌ఆర్ కాంప్లెక్స్
- వర్షాకాలంలో కారిపోతున్న శ్లాబ్‌లు
- పెచ్చులూడిపోయిన గోడలు.. పగిలిన మెట్లు
- పట్టించుకోని అధికారులు


టీఎస్‌ఆర్ కాంప్లెక్సులో మూతపడిన దుకాణాలు


అధ్వానంగా ఉన్న కాంప్లెక్సు వరండా పరిసరాలు


మెట్లమార్గం మీద చెల్లాచెదురుగా వ్యర్థాలు

సీతమ్మధార: జీవీఎంసీకి చెందిన టీఎస్‌ఆర్ కాంప్లెక్సుకి ఏళ్ల తరబడి మరమ్మతులు, ప్యాచ్ వర్కులు లేకపోవడంతో కాలక్రమంలో శిథిలావస్థకు చేరుకుంటున్నా పట్టించుకున్న నాథుడే కరవయ్యాడు. ఇక్కడి ద్వారకా బస్‌స్టేషన్ నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్లే మార్గంలో 31వ వార్డులో గల టీఎస్‌ఆర్ కాంప్లెక్సులో అధిక సంఖ్యలో దుకాణాలు ఉన్నాయి. ఈ వాణిజ్య సముదాయం దాదాపు 40 ఏళ్ల క్రితం నిర్మించారని వ్యాపారులు చెబుతున్నారు. జీవీఎంసీ జోన్-3 రెవెన్యూ విభాగం పరిధిలో ఈ వాణిజ్య సముదాయం ఉంది. అలాగే ఈ కాంప్లెక్సులో జీవీఎంసీ-ఏయూటీడీ నిరాశ్రయుల వసతిగృహం, నాటక గ్రంథాలయం కూడా ఉన్నాయి. ఈ కాంప్లెక్సులో దశాబ్దాలుగా చెప్పుల దుకాణాలు, ఫ్రూట్‌జ్యూస్, హోటళ్లు, బంగారం దుకాణం, బట్టల దుకాణాలు ఉన్నాయి. వినియోగదారులతో నిత్యం రద్దీగా వుండే ఈ భవనం శిథిలావస్థకు చేరుకుని పెచ్చులు రాలిపోతున్నా జీవీఎంసీ ఇంజినీర్లలో చలనం లేదని వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. ప్రతినెలా ఠంచన్‌గా అద్దెలు వసూలు చేస్తున్న జీవీఎంసీ జోన్-3 రెవెన్యూ విభాగం మరమ్మతుల మీద దృష్టి సారించడం లేదని విమర్శలు గుప్పిస్తున్నారు. వర్షాలు పడితే శ్లాబు నుంచి నీరు కారిపోతోందని వ్యాపారులు వాపోతున్నారు. ఇక్కడ జీ ప్లస్ 2 విధానంలో రెండు భవనాల్లో దుకాణాలు ఉన్నాయి. నగరంలోని అన్ని నియోజకవర్గాలకు చెందిన ప్రజలు ఇక్కడ షాపింగ్ నిమిత్తం వస్తుంటారు.

వసతి గృహానికీ తప్పని తిప్పలు...

ఈ వాణిజ్య సముదాయంలో జీవీఎంసీ-ఏయూటీడీ నిరాశ్రయుల వసతిగృహం కూడా ఉంది. ఇక్కడ పురుషులు, మహిళల కోసం వసతిగృహాలు నిర్వహిస్తున్నారు. రెండు గృహాల్లో 80 మంది వరకు నిరాశ్రయులు ఉన్నారు. గోడలు, భవనాలు శిథిలావస్థకు చేరుకోవడంతో ఇటు సిబ్బంది, అటు నిరాశ్రయులు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాంప్లెక్సుని ఆనుకుని ఉన్న రోడ్డు నిత్యం ట్రాఫిక్‌తో రద్దీగా ఉంటుంది. ఇక్కడి సిగ్నల్స్ వద్ద ఆగే వాహన చోదకులు ఈ భవనం వైపు చూసి భయభ్రాంతులకు గురవుతున్నారంటే అతిశయోక్తి కాదు. టాయ్‌లెట్లు కూడా శిథిలమైపోవడంతో దుకాణాలకు చెందిన వ్యాపారులు, సిబ్బంది కూడా చెప్పరాని పాట్లు పడుతున్నారు. ఈ భవనంలో జ్యూస్‌షాపులు, పాన్‌షాపుల వద్ద కూడా నిత్యం అధిక సంఖ్యలో ప్రజలు గుమిగూడి ఉంటారు. దీంతో పెచ్చులు ఊడిపోయి కిందనున్న ప్రజలపై పడే ప్రమాదం పొంచి ఉందని పలువురు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు, ఇంజినీర్లు స్పందించి వెంటనే ఇక్కడి దుకాణాలకు మరమ్మతులు నిర్వహించాలని వ్యాపారులు కోరుతున్నారు. ఇక్కడ రెండు అంతస్తుల్లో మొత్తం 40 దుకాణాలు ఉన్నాయి. గ్రౌండ్‌ఫ్లోర్‌లో మరో 40 వరకు దుకాణాలు ఉన్నాయి. అలాగే, నాలుగు భవనాల్లో సచివాలయాలు నిర్వహిస్తున్నారు. గతంలో ఇక్కడ కొత్త భవనం నిమిత్తం పాత దుకాణాలు కూల్చేయాలని ప్రతిపాదనలు రూపొందించినా ఆచరణ సాధ్యం కాలేదు.

> **ప్రతిపాదనలు తయారు చేశాం..**
>
> శిథిలమైన టీఎస్‌ఆర్ కాంప్లెక్సు భవనం కూల్చేసి కొత్త భవనం నిర్మించేందుకు గతంలోనే ప్రతిపాదనలు తయారు చేశాం. ఇంజినీరింగ్ విభాగానికి పరిశీలన నిమిత్తం గత కమిషనర్ ఆదేశాలు కూడా జారీ చేశారు. త్వరలోనే ఈ విషయమై స్పష్టత రానుంది. దాని ప్రకారం తదుపరి చర్యలు చేపడతాం.
>
> – మల్లయ్యనాయుడు, జెడ్సీ, జీవీఎంసీ జోన్-4

మహిళారత్నం పురస్కార గ్రహీతకు అభినందనలు


అధ్యాపకురాలిని సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ సింహాద్రినాయుడు తదితరులు

డాబాగార్డెన్స్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పోలీస్ కమిషనర్ చేతుల మీదుగా మహిళా రత్నం పురస్కారం అందుకున్న ఏవీఎన్ కళాశాల తెలుగు అధ్యాపకురాలు డబ్బీరు గాయత్రిని సోమవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం. సింహాద్రినాయుడు, డీన్ శంకరనారాయణరావు, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణకుమారి, వుమెన్ అసోసియేషన్ అధ్యక్షురాలు భానుమతి, పలువురు అధ్యాపకులు అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మహిళ అంటే ఓర్పు, సహనం, ధైర్యం అన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ప్రతిభ కనబరచాలంటూ ప్రోత్సహించారు. అనంతరం కళాశాల పొలిటికల్ సైన్స్ అధ్యాపకురాలు, ఎన్‌సీసీ కెప్టెన్ సునీత, ప్రాంగణంలో పని చేస్తున్న రాము, మరియమ్మలను సత్కరించారు.

23న రౌండ్ టేబుల్ సమావేశం

డాబాగార్డెన్స్: ఈ నెల 23న మానవ హక్కుల పరిరక్షణకు విశాఖలో గల న్యాయనిపుణులు, న్యాయవాదులు, న్యాయ కళాశాలల ప్రొఫెసర్లతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్టు మానవ హక్కుల కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి మంత్రి శ్యాంప్రసాద్ పేర్కొన్నారు. ఈ సదస్సులో దామోదరం సంజీవయ్య న్యాయ విశ్వ విద్యాలయం ప్రథమ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ వై. సత్యనారాయణ పాల్గొంటారని తెలిపారు. మానవ హక్కుల ఉల్లంఘనలపై త్వరితగతిన విచారించడం, మానవ హక్కుల పరిరక్షణకు చర్యలు తీసుకోవడం, మానవ హక్కుల అమలు కృషి తదితర అంశాలపై సమావేశంలో చర్చించనున్నట్టు చెప్పారు. మానవ హక్కుల చట్టాన్ని పార్లమెంట్ ఆమోదించి 32 ఏళ్లయినా దేశవ్యాప్తంగా ఎక్కడా మానవ హక్కుల కోర్టులు పని చేయడం లేదన్నారు. ఫలితంగా ప్రాథమిక హక్కులకు భంగం కలిగినప్పుడు పౌరుల రక్షణకు భద్రత లేకుండా పోతుందన్నారు. పలు హక్కులకు భంగం కలిగినప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించనున్నట్టు తెలిపారు.

బీసీల డిమాండ్ల సాధనకు చలో ఢిల్లీ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీసీ నాయకులు

డాబాగార్డెన్స్: బీసీల న్యాయమైన డిమాండ్ల సాధనకు తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమం విజయవంతం చేయాలని విశాఖ ఉమ్మడి జిల్లా బీసీ సంఘం అధ్యక్షుడు బోగి రమణ పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో కార్యక్రమ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బోగి రమణ మాట్లాడుతూ జాతీయ బీసీ సంక్షేమ సంఘం, ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో బీసీల డిమాండ్ల సాధనకు ఈ నెల 12, 13 తేదీల్లో ఈ కార్యక్రమం తలపెట్టినట్టు చెప్పారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టాలని, ఓబీసీలకు 50 శాతం రాజకీయ రిజర్వేషన్, బీసీ మహిళలకు రిజర్వేషన్ కల్పిస్తూ బిల్లు పెట్టాలన్నారు. కేంద్రంలో ఓబీసీలకు మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలని, బీసీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్ కల్పించాలన్నారు. బీసీ ఉద్యమ నేత పితాని ప్రసాద్ మాట్లాడుతూ బీసీ డిమాండ్లపై న్యూఢిల్లీలో సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. 12న ఆంధ్రా భవన్‌లో బీసీ మేధావుల రౌండ్ టేబుల్ సమావేశం, 13న బీసీ మహిళా రిజర్వేషన్ బిల్లుపై సదస్సు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అలాగే బీసీ జనగణన, చట్ట సభల్లో రిజర్వేషన్లు కల్పించాలని, బీసీలకు క్రీమీలేయర్ విధానాన్ని రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏపీసీసీ సభ్యుడు జీఏ నారాయణరావు, వావిలపల్లి శ్యామ్ సుందరనాయుడు, రమేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపు ఆపాలి

డాబాగార్డెన్స్: విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌లో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను తొలగించాలని కేంద్ర ప్రభుత్వం, స్టీల్ యాజమాన్యం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని సిటు నాయకుడు ఆర్‌కేఎస్‌వి కుమార్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్‌లో సుమారు 15 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు అనేక సంవత్సరాలుగా పని చేస్తున్నారన్నారు. వీరు లేకపోతే ప్లాంట్ మనుగడ సాధ్యం కాదన్నారు. అటువంటిది ఇప్పుడు వీరిని బలవంతంగా తొలగించాలని స్టీల్ మినిస్ట్రీ నిర్ణయించడం దుర్మార్గమన్నారు. కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపు ప్రక్రియను తక్షణమే ఆపించాలన్నారు. లేకపోతే భవిష్యత్తులో జరిగే పోరాటాలకు తగిన మూల్యం చెల్లించుకోవలసి ఉంటుందని సీఐటీయూ విశాఖ జిల్లా కమిటీ హెచ్చరిస్తున్నట్లు పేర్కొన్నారు.

కాలుష్య నియంత్రణకు సహకరించండి

మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పిలుపు


ఆర్టీసీ బస్సులో జీవీఎంసీకి వచ్చిన మేయర్ హరి వెంకటకుమారి

డాబాగార్డెన్స్: కాలుష్య నియంత్రణకు సహకరిస్తూ ప్రతి ఒక్కరూ వారంలో ఒక రోజు వ్యక్తిగత వాహనాలు విడనాడి ప్రజా రవాణాను వినియోగించాలని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పిలుపునిచ్చారు. ఆమె సోమవారం తన క్యాంపు కార్యాలయం నుంచి ఆర్‌టీసీ బస్సులో జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ కాలుష్య నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. జీవీఎంసీ అధికారులు, ఉద్యోగులు ప్రజా రవాణాపై ఉపయోగిస్తున్నారన్నారు. కాలుష్య నియంత్రణకు జీవీఎంసీ అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, పరిశ్రమల యాజమాన్యాలు, స్వచ్ఛంద సంస్థలు, నగర ప్రజలు సహకరించి వారంలో ఒక్క రోజు రవాణా వ్యవస్థను, లేదా సైకిళ్లను ఉపయోగించడం వల్ల విశాఖ నగరంలో కాలుష్యాన్ని పూర్తిగా నియంత్రివచ్చని, అందుకు అందరూ సహకరించాలని మేయర్ విజ్ఞప్తి చేశారు.

మహిళా వైద్యులకు సత్కారం


డాక్టర్ సరోజనిని సత్కరిస్తున్న ఐఎంఏ జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ వాణి

మహారాణిపేట: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ విశాఖ బ్రాంచ్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా పరిషత్ సమీపంలో ఉన్న అంకోశాలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య రంగంలో నిష్ణాతులైన ప్రముఖ వైద్యులను సన్మానించారు. ఐఎంఏ విశాఖ అధ్యక్షురాలు డాక్టర్ ఐ.వాణి మాట్లాడుతూ వైద్య రంగంలో మహిళలు పురుషులకు దీటుగా చక్కగా పని చేస్తున్నారని అన్నారు. ఐఎంఏ జిల్లా కార్యదర్శి ఎంవీవీ మురళీ మోహన్ మాట్లాడుతూ సమాజానికి మహిళలు ఎన్నో సేవలు అందిస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా రిటైర్డ్ డీఎంఈ డాక్టర్ ఆర్.శశిప్రభ, వైద్య ఆరోగ్యశాఖ రిటైర్డ్ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ జె.సరోజని, ఏఎంసీ రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుబ్రహ్మణ్యం, ప్రముఖ గైనికాలజిస్ట్ డాక్టర్ బి.సుధారాణి తదితరులను సన్మానించారు. ఐఎంఏ కోశాధికారి డాక్టర్ వాణిశ్రీ వందన సమర్పణ చేశారు.

రూ.4వేలు పెన్షన్ వర్తింపజేయాలి

- ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల డిమాండ్


జీవీఎంసీగాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న యూనియన్ నాయకులు

సీతమ్మధార: ప్రభుత్వం వృద్ధులకు ఇస్తున్న పింఛన్ మాదిరిగానే ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులకు రూ.4 వేలు పెన్షన్‌ను ఇవ్వాలని ఏపీఎస్‌ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి ఏవీ రావు, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వీవీకే రాయ్, ఉపాధ్యక్షులు సీహెచ్ పైడిరాజు రెడ్డి, బొడ్డేటి జగతరావు డిమాండ్ చేశారు. ఏపీఎస్ ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ విశాఖ రీజియన్ నేతృత్వంలో సోమవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద భారీ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మీడియాతో మాట్లాడుతూ రూ.4వేలు పెన్షన్ వర్తింపజేయాలని కోరామని, సమస్య పరిష్కారానికి ఈ నెల 14న చలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టి ముఖ్యమంత్రికి వినతి పత్రం అందజేస్తామన్నారు. ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం. ఈశ్వరరావు, కోశాధికారి ఎం. జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం కావాలి


వినతులు స్వీకరిస్తున్న జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడు

జగదాంబ: ప్రజా సమస్యల పరిష్కార వేదికను ప్రజలు వినియోగించుకోవాలని జీవీఎంసీ జోన్-4 జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు అన్నారు. సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి పబ్లిక్ హెల్త్ నుంచి 1, రెవెన్యూ విభాగం నుంచి 2 వినతులు వచ్చాయి. ఈ సందర్భంగా జెడ్సీ మాట్లాడుతూ గ్రీవెన్స్ సెల్ ద్వారా వచ్చిన సమస్యలు వెంటనే పరిష్కరించాలన్నారు. సమస్యలపై వచ్చిన ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పకూడదన్నారు. సమస్యల పరిష్కారం తర్వాత వినతుల్లో ఇచ్చిన ఫోన్ నంబర్ ద్వారా సమస్య పరిష్కారం అయిందా.. లేదా అని అడిగి తెలుసుకోవాలన్నారు. పరిష్కారం అయిన సమస్యలను రికార్డులో నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంహెచ్‌వో కృష్ణంరాజు, ఇంజినీరింగ్ అధికారి వెంకటేశ్వరరావు, రెవెన్యూ అధికారి అప్పలరాజు, ఎలక్ట్రికల్, తాగునీటి విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.


జోన్-5లో వినతులు స్వీకరిస్తున్న జెడ్సీ రాము

జోన్-5లో..

కంచరపాలెం: జీవీఎంసీ జోన్-5 జ్ఞానాపురం కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 2 వినతులు అందాయి. అర్జీదారుల నుంచి జోనల్ కమిషనర్ బి. రాము వినతులు స్వీకరించి ఆయా విభాగాల అధికారులకు అందజేశారు. రెవెన్యూ విభాగానికి 1, పబ్లిక్ హెల్త్ విభాగానికి 1 వినతి అందినట్లు జెడ్సీ రాము తెలిపారు. పరిష్కార వేదికలో వచ్చిన వినతులను తక్షణం పరిష్కరించాలన్నారు. జోన్ పరిధిలో టౌన్‌ప్లానింగ్‌పై అధికంగా ఫిర్యాదులు అందుతున్నాయని, వార్డు పర్యటనలో అధికారులు విధిగా పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఆర్వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఇంజినీరింగ్ ఈఈ తారా ప్రసన్నరెడ్డి, డీఈ రామ సుబ్బారావు, పబ్లిక్‌హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ సునీల్‌కుమార్, ఏపీడీవోలు కృపానందం, పుణ్యవతి, టౌన్‌ప్లానింగ్ టీపీవో ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అన్నా క్యాంటీన్లలో నాణ్యత పాటించాలి


భోజనం చేస్తున్న యువకుడితో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

మహారాణిపేట: అన్నా క్యాంటీన్లను పరిశుభ్రంగా నిర్వహించాలని, ఆహార పదార్థాలలో నాణ్యతను పాటించాలని కలెక్టర్, జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ అన్నారు. సోమవారం ఆయన జోన్ 4 పరిధి కేజీహెచ్ ఓపీ గేట్ సమీపంలో వున్న అన్నా క్యాంటీన్‌ను జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడితో కలిసి పరిశీలించారు. నిత్యం అన్నా క్యాంటీన్లను పరిశుభ్రంగా ఉంచాలని జెడ్సీ మల్లయ్య నాయుడును ఆదేశించారు. భోజనం చేస్తున్న వారితో మాట్లాడి ఆహారం నాణ్యత, రుచి గురించి అడిగి తెలుసుకున్నారు. భోజనం చేసే వారి పట్ల శ్రద్ధ కనబరచాలని, అతిథి దేవోభవ అంటూ చిరునవ్వుతో వడ్డించాలన్నారు. ఎటువంటి లోపాలు లేకుండా, ఆహార సరఫరాలో లోటు లేకుండా చూడాలని జోనల్ కమిషనర్‌కు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ జోన్ -4 ఏపీడీ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ తృతీయ ఫలితాల్లో విద్యార్థినుల ప్రతిభ


ప్రతిభ చాటిన విద్యార్థినులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

డాబాగార్డెన్స్: ఆంధ్రా యూనివర్సిటీ డిగ్రీ తృతీయ సంవత్సరం ఫలితాల్లో ఆదిత్య డిగ్రీ కళాశాల (రామ్‌నగర్) విద్యార్థినులు ప్రతిభ చూపారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ షాహిద్ అలీ తెలిపారు. ఈ మేరకు సోమవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో అత్యధిక గ్రేడ్ పాయింట్లు సాధించిన విద్యార్థినులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిగ్రీ తృతీయ సంవత్సరం ఐదవ సెమిస్టర్ ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థినులు 98.83 శాతం ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. ప్రతిభ సాధించిన విద్యార్థినులను కళాశాల నార్త్ ఆంధ్ర రీజియన్ డైరెక్టర్ పి. రామకృష్ణారెడ్డి, నోడల్ అకడమిక్ అధికారి ఎన్. వెంకటరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఎస్. హిమశేఖర్, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి చంద్రశేఖర్ పలువురు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

కమనీయంగా దేవేరుల కల్యాణోత్సవం


పూజలో పాల్గొన్న భక్తులు

అల్లిపురం: వన్‌టౌన్‌లో వెలసిన కన్యకాపరమేశ్వరి దేవాలయంలో నగరేశ్వరస్వామి-వింధ్యవాసిని, జనార్దనస్వామి-కోన కమలాదేవి పరిణయ మహోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 16 వరకు నిర్వహించే ఈ వేడుకలు శైవాగమ విద్వాన్ చంద్రమౌళి ప్రభాకర సత్యనారాయణశర్మ, చంద్రమౌళి మల్లీశ్వరి శర్మ, ఆలయ అర్చకుడు రాంబిల్లి బుచ్చి భాస్కరకుమారశర్మల ఆధ్వర్యంలో జరిగిందని ఆలయ ఆహ్వాన కమిటీ అధ్యక్షుడు శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు కల్లూరి సత్తిబాబు తెలిపారు. మొదటిరోజు విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, పంచగవ్యం, దీక్షాధారణ, త్రిశూల పూజ, వాస్తు పూజ నిర్వహించారు. సాయంత్రం అంకురారోహణ, ధ్వజారోహణ, హోమాలు, పాణిగ్రహణం, నీరాజన మంత్రపుష్పం, ప్రసాద వితరణ నిర్వహించారు. కార్యక్రమంలో బొడ్డు రఘు, నల్లూరి నూకరాజు, దుర్గా నూకేశ్వరరావు, కె.సూర్యనారాయణ, అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఆర్‌ఐ మహిళ మృతిపై సమగ్ర దర్యాప్తునకు డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న పద్మ

డాబాగార్డెన్స్: హోటల్ మేఘాలయలో ఎన్‌ఆర్‌ఐ మహిళ కాకర్లపూడి రోజా మృతిపై ఎన్నో అనుమానాలున్నాయని, సమగ్ర దర్యాప్తు చేపట్టాలని మహిళా చేతన ప్రధాన కార్యదర్శి కె.పద్మ డిమాండ్ చేశారు. రోజా మృతి పలు అనుమానాలకు తావిస్తుంటే త్రీటౌన్ పోలీసులు కేసును నీరుగార్చేందుకు ప్రయత్నిస్తున్నారని ఆమె ఆరోపించారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం హెచ్‌ఆర్‌ఎఫ్ ప్రతినిధి అనురాధ, భారత నాస్తిక సమాజం ప్రతినిధి నూకరాజుతో కలిసి మీడియాతో మాట్లాడారు. ఈనెల 6వ తేదీన హోటల్ రూమ్‌లో రోజా చనిపోతే ఎఫ్‌ఐఆర్ నమోదు చేసిన త్రీటౌన్ పోలీసులు ఈ విషయాన్ని మీడియాకు తెలియజేయకపోవడం అనుమానం కల్గిస్తోందన్నారు. డాక్టర్ పిళ్లా శ్రీధర్ ఎవరు? రోజాకు ఆయనకు సంబంధం ఏంటి? శ్రీధర్ ఎందుకు హోటల్‌లో రూం అద్దెకు తీసుకున్నాడు..ఆమె ఆ గదికి రావడానికి కారణమేంటి? రోజా మృతి చెందినప్పుడు అతను హోటల్ రూంలోనే ఉండగా.. హోటల్ మేనేజర్ ఆంథోని డేవిడ్ నుంచి ఫిర్యాదు ఎందుకు తీసుకున్నారు? పోస్టుమార్టం నివేదిక రాకుండానే ఎఫ్‌ఐఆర్‌లో నో ఎక్యూజ్డ్ అని ఎలా రాశారు? అని ప్రశ్నించారు. దీనిపై పోలీస్ కమిషనర్ దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. అనుమానాస్పదంగా వ్యవహరించిన త్రీ టౌన్ సీఐని విధుల నుంచి తప్పించాలని, డాక్టర్ శ్రీధర్‌ను అదుపులోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.